# భస్మోద్ధూళిత విగ్రహాయ



కోటంరాజు శ్రీనివాసరావు

ఓం నమః శివాయ

# భస్మోద్ధూళిత విగ్రహాయ

**ఓం** నమః శంభవేచ మయోభవేచ

ఓం నమః శంకరాయచ మయోస్కరాయచ

ఓం నమః శివాయచ శివతరాయచ

అని స్మరిస్తూ ఆ పరమేశ్వరునికి అభిషేకము కావించినట్లుగా భావించి ప్రారంభించుచున్నాను. కాసిని నీళ్ళు తీసుకుని తలపై చల్లుకొనినచో సాక్షాత్తు శివలింగముపై జలం చల్లినట్లగును. షట్చక్రములలో 7వది సహస్రాదారము. అది శిరస్సుపై ఉన్న స్థానము. అక్కడ సాక్షాత్తు పరమేశ్వరుడు ఉన్న స్థానము. కావుననే నీళ్ళు శిరస్సుపై చల్లుకొనిన యెడల శివలింగానికి అభిషేకము చేసినట్లగును. శ్రీ సాయి సచ్చరిత్రలో 28వ అధ్యాయమున సాయి భక్తుడైన మేఘశ్యాముడు ఒక మకర సంక్రాంతి పర్వదినమున బాబాకు అభిషేకము చేయదలచి తన కోరికను సాయికి తెలుపగా సాయి తనకు ఇష్టము లేకున్నను తన భక్తుడు శివభక్తుడగుటచే సమ్మతించి తన భక్తునితో నిట్లనెను. “ఓ మేఘా! శరీరమునకు తల ముఖ్యము. కావున తలపైనే నీళ్ళు పోయుము. అట్లు చేసినచో శరీరమంతటిపై పోసినట్లగును” అని శ్రీ సాయి పలుకగా మేఘశ్యాముడు భక్తి పారవశ్యముతో “హరే గంగ”అంటూ శ్రీ సాయి శరీరమంతటిపై తాను తెచ్చిన గోమతీనదీ తీర్థమును పోయగా చిత్రముగా సాయి తల మాత్రమే తడిసి, వారి శరీరము పొడిగానే ఉండెను. సాక్షాత్తు ఆ సాయీశ్వరుడే శరీరమునకు తల ముఖ్యమని చెప్పెను. నిజానికి శ్రీ సాయి సాక్షాత్తు ఆ శివుడి అవతారమే. కావుననే వారిని సాయీశ్వరుడని అనుచున్నాము. సాయి చూపిన ఈ నిదర్శనము బట్టి ప్రతి మానవునికి తన శరీరమునకు తల ముఖ్యమైనదని అది సాక్షాత్తు ఈశ్వర స్థానమని కావున నీళ్ళు తలపై చల్లుకొనినచో శివలింగముపై పోసినట్లగును.

ఒక్కసారి తల భాగాన్ని గమనించినచో నిజంగా శివలింగాకారముగనే ఉండను. ఇక మానవుని శరీరముతో వాని రూపురేఖలతో ఆకారముతో లేదా అందముతో ఇక ఏమి పని? ఒక్కసారి ఆలోచిస్తే ఈ కనిపించే రూపు రేఖలు, అందము అంతా అశాశ్వతమే. కాబట్టి శరీరము అశాశ్వతమని, శరీరములోనున్నది శాశ్వతమని అంతరంగములో నున్న చైతన్యమే ఈశ్వరుడని, వారు నిరాకారులని, సర్వవ్యాపి అని అందరిలో ఉన్నవాడని గమనించవలెను. సాధారణముగా శివుడికి రూపముతో ఉన్న విగ్రహములు దేవాలయములలో చూడటము చాలా అరుదు. ఎక్కడ చూచినను శివలింగములు కనిపించును. లింగము అనగా ఒక ఆకారము లేనిదని భావించవలెను. అనగా భగవంతుడు ఆకారము లేనివాడని, నిరాకారుడని గుర్తించుటకే శివుడు లింగాకారములో కన్పిస్తూ ఉంటాడు. అయితే లింగము కూడా ఒక రాయిలా లేదా సాలగ్రామములా కనిపించుచున్నది కదా అది కూడా ఒక ఆకారమే కదా అని అనుకోవచ్చు. కాని ఇక్కడ అంతరార్థము పరమాత్ముడు ఆకారము లేనివాడని అంటే నమ్ముటకు శక్యము కాదు. ఆ విధముగా తలచుట కూడా కష్టమే. మనము మానవ మాత్రులము కనుక ఆ ఈశ్వరుడు మానవులకున్న పరిజ్ఞానము మేరకు ఒక రాయిలాగా చూపి పరమాత్మ ఆకారము లేనివాడని మానవునకు అర్థమయ్యేలా రాయిగా కన్పించుచున్నాడు ఆ ఈశ్వరుడు. కావుననే లింగాన్ని చూసినప్పుడు జనులు ఈశ్వరునికి రూపులేదని ఆ రాయిని చూచుట వలన నిరాకారమనే భావన వ్యక్తమగుచున్నది. అసలు ఈశ్వరుడు సర్వవ్యాపి, నిరాకారుడు, చైతన్యము. అలాగే మానవ శరీరములో తల భాగము గమనించినచో శివలింగాకారముగా కనపడును. అదే ఈశ్వరస్థానము. మిగతా శరీరమంతా వ్యర్థమే. నిజానికి శివలింగము వలె మన శిరస్సు కూడా ఒక రాయి వలె కన్పించినను నిజానికి ఈశ్వరుడు ప్రతి జీవిలో చైతన్యరూపముగా దేదీప్యమానముగా వెలుగుచున్నాడు. మరణము చెందిన పిదప మానవ శరీరమును అంత్యక్రియలు జరిపిన పిదప ఆ మానవుని శరీరమంతా భస్మమగును. శరీరము పోయినప్పటికి చైతన్యము పోదు. మరి ముందు కనిపించిన

శరీరమంతా ఏమయ్యింది? మొత్తము భస్మముగా మారినది. దీనిని బట్టి లోనున్న ఆత్మ భస్మముతో కప్పబడిన విగ్రహమని ఋజువైనది. పై పై కనిపించే శరీర సౌందర్యము రంగు ఆకారము అంతా ఒట్టిదే. లోనున్న ఈశ్వరుడే సత్యమైనది. కనిపించే రూపురేఖలన్నీ కేవలము భస్మమే. లోనున్న ఈశ్వరుడి నిజమైన రూపం. "భస్మోద్ధూళిత విగ్రహం".

శివుడు అని అనగానే అందరికీ తెలిసింది ఈ పరమేశ్వరుడు భోళాశంకరుడని, పరమేశ్వరుడు తన భక్తుల నుండి ఏమీ కోరనివారు. కాని భక్తుల యొక్క భక్తికి మెచ్చి ఏ వరమైనను ఇచ్చుటకు సిద్ధముగా ఉండే పరమాత్ముడే ఆ శంకరుడు. రావణాసురుడికి శివుడు తన ఆత్మలింగాన్నే అర్పించుటకు సిద్ధమైనాడు. భస్మాసురుడు అను రాక్షసుడికి ఇవ్వరానటువంటి వరమును ప్రసాదించి తన ప్రాణమునకే ముప్పు తెచ్చుకున్నాడు ఆ శంకరుడు. పెరియపురాణము అనే గ్రంథములో 63 మంది శివభక్తుల చరితముతో నిండినది. అందులో 'పూశలారు నాయనారు' అనే శివభక్తుడు ముఖ్యమైనవాడు. అతడు తన ఇష్టదైవమైన శివునికొరకు ఆలయము నిర్మింపదలచి నిధుల కొరకు తిరుగగ ఫలితము లేకపోవుటచే చిట్టచివరకు తన మనసులోనే శివాలయమును ఎందుకు నిర్మించకూడదని ఆలోచన తట్టి తగు కార్యమునకై కావలసిన వస్తు సామగ్రి నంతటిని మనస్సులోనే సమకూర్చుకుని ఒక శుభముహూర్తమున శాస్త్రోక్తముగా మనస్సు నందు పునాది వేసి శివుని ప్రతిష్ఠకై శుభముహూర్తము కూడా నిర్ణయించుకొనెను. అదే సమయమున కాంచీపురములో నున్న కాడవరాజు అధిక వ్యయముతో శివాలయము కట్టించెను. ఆ రాజు కూడా శివుని ప్రతిష్ఠకై శుభముహూర్తము నిర్ణయించెను. కాని శంకరుడు రాజు స్వప్నము నందు దర్శనమిచ్చి, "నేను రేపు నా భక్తుడు పూశలారు నిర్మించిన ఆలయమున ప్రవేశింపదలచితిని. కావున నీ ఆలయ ప్రతిష్ఠను మరొకనాడు నిశ్చయించుకొను"మనెను. ఈ శివభక్తుడి భక్తిని చూచి గమనించదగినది ఏమనగా భక్తితో జరగనిది ఏదీ లేదని ప్రతి జీవి మనస్సులో గమనించినచో శివాలయము కలదని ప్రతి జీవి యొక్క ఆత్మయే శివలింగమని గ్రహించవలెను. బహుశ శంకరుడు తన భక్తుడైన రావణాసురుడికి శివుడు తన ఆత్మలింగాన్ని ఇచ్చుటలో అంతరార్థము కూడా ఆత్మే ఆ పరమేశ్వరుడని ఋజువు చేయుటకే. శివుడు ఎంతటి భోళాయో తెలుస్తుంది. మరి అటువంటి భోళాశంకరుని వశము చేసికొనుటకు ఏమి ఇస్తే పరవశుడగుతాడో పరిశీలిద్దాం.

చంద్రుడినే శిరస్సుపై ఉంచుకుని, గంగను తన కేశములలో బంధించుకుని, అగ్నిని తన మూడవ కన్నులో ఉంచుకుని, గరళాన్ని తన కంఠములో స్థిరముగా క్రిందకు జారకుండా బంధించిన ఈ జటాజూటదారి, నాగభూషణుడు, త్రిశూలధారి అయిన శంకరునికి ఏమీ అవసరం లేదు. శివుడు కోరేది భక్తి మాత్రమే. తన భక్తుడు ఒక్క నీటి బొట్టు లింగముపై సమర్పించినచో పరవశుడయ్యే వాడే ఆ పరమశివుడు. "ఏక బిల్వం శివార్పణం" అంటే ఒకే ఒక ఆకు సమర్పించినచో ముగ్ధుడయ్యేవాడే ఆ సదాశివుడు. "ఓం నమః శివాయ" అనే శివపంచాక్షరి నామము పఠించిన వారికి సంపూర్ణ కటాక్షమును ప్రసాదించేవాడే ఆ భుజంగభూషణుడు. ఎల్లప్పుడు ఒంటినిండా భస్మమును రాసుకునేవాడే ఆ భస్మోద్ధూళిత విగ్రహరూపుడు. కాని రుద్రుడు ఎంత ప్రసన్నుడో, అంతటి రౌద్రుడు. ఆ విరూపాక్షునికి కోపము వచ్చినచో తన మూడవ కన్నును తెరిచినచో చాలు ఇక ప్రళయమే. ఆ నటరాజు నృత్యము చేసినచో తన జటాజూటము వీడి గంభీరముగా కనిపిస్తాడు. ఆ లలాటాక్షుని చూచుటకు ఎవ్వరైనను భయకంపితులగుదురు. కాని శంకరుడు ఇంత కఠోరముగా కనిపించినను, నిజానికి తాను త్రిలోకేశుడు. అడిగిన వరములను కాదనకుండా ఇచ్చేవాడే ఆ మహాదేవుడు.

శంకరుడు మూడు కన్నులు కలవని, కావున శివుడు త్రినేత్రుడు అని సంభోదించెదరు. ఈ మూడు నేత్రములు ఒకటి సూర్యుడు, రెండు చంద్రుడు, మూడు అగ్ని. కాని ఇచ్చట సూర్య, చంద్ర, అగ్ని గ్రహ గోళములు సంభందించనవి కాదు. శివుని కన్ను సూర్యతత్త్వమును, శివుని మనస్సు చంద్రతత్త్వమును మరియు శివుని ప్రాణము అగ్నిగను సూచించబడినవి. ఇవే శంకరుని మూడు కన్నులు. శంకరుడు ఎంతటి కరుణామూర్తియో కన్నప్ప అనే భక్తుడి విషయములో ఋజువు అవుతుంది. తిన్నడు (కన్నప్ప) అపార శివభక్తుడు. ప్రతిరోజు పరమభక్తితో శివలింగాన్ని పూజించేవాడు. తన రెండు చేతులలో రెండు దొప్పలనిండా మాంసకబళము మరియు బిల్వదళములు పట్టుకుని తన నోటి నిండా నీరును పుక్కిలిబట్టి తన కాలి చెప్పులతో

శివలింగముపై నున్న పుష్పములను తుడిచి తన పుక్కిలిపట్టిన నీరును శివలింగముపై ఉమ్మేవాడు. ఇది చూచుటకు మహాపాపముగా వ్యంగ్యముగా కనిపించినను ఆ పరమశివుడు మటుకు దీనినే దివ్యాభిషేకముగా భావించినారు. తిన్నడు భక్తికి మెచ్చి శివుడు ఒక పరీక్ష తిన్నడికి పెట్టినాడు. శివలింగముపై నున్న కంటి నుండి నీరు కార్చుట ఆరంభించినాడు. తిన్నడు తన కన్ను తీసి శివునికి అర్పించెను. కాని శివుని రెండవ కంటినుండి కూడా నీరు కారుట గమనించి, తిన్నడు తన రెండవ కన్నును కూడా శివుడికి అర్పింపబోగా శంకరుడు ప్రత్యక్షమై ఇట్లనెను, “నీవు నాకు కన్ను ఇచ్చిన తండ్రివి. కావున ఇక నుండి నీ పేరు కన్నప్ప. నేను అన్నము తిననిదే నీవు తినవని పట్టు పట్టినావు కనుక ఇక మీద నీవు అన్నము తిననిదే నేను తినను” అని పలికినాడు ఆ భోళాశంకరుడు. ఈ సంఘటన బట్టి శంకరుడు చూచుటకు ఎంత గంభీర్యముగా ఉన్నను తనను తన మనసు ఎంతటి దయార్ద్రహృయదముతో ఉన్నది కదా! కనుకనే శంకరుడు భోళాశంకరుడయ్యెను.

ప్రతి జీవి హృదయములో మహాదేవుడు కొలువైయున్నాడు. ఇది సత్యం. “హృదయంమే మహాదేవా! ఈశ్వరో వ్యాత్ స్తనాంతరమ్” అని రుద్ర కవచమున చెప్పబడినది. ప్రతి జీవిలో పరమేశ్వరుడు తప్పక కొలువైయుంటాడు. అయితే అది ఎంతవరకు నిజమనే సందేహము ప్రతి వారికి కలుగుతూనే ఉంటుంది. ప్రతి జీవిలో పరమాత్ముడు ఉండుననే నిదర్శనము ఆ పరమేశ్వరుడు దక్షుడి విషయంలో నిరూపించెను. పూర్వము శివుడు తనకు నమస్కరించలేదని దక్షుడు మిక్కిలి కోపించెను. శివుడు అది అసత్యమని చూపెను. సర్వజీవులలో ఉన్న పరమాత్మకు త్రికరణశుద్ధిగా నమస్కరించు వానికే ఈశత్వము సిద్ధించునని, తన కెదుటివారు నమస్కరింపలేదని అని అనుకొనిన వారికి భౌతికమైన నమస్కారము చేయకూడదని అట్లు చేసినచో వారి అహంకారము ఇంకా పెరుగునని శివుడు చెప్పెను. కాని త్రికరణశుద్ధిగా నమస్కారము చేయుట మాత్రము మానరాదని శివుడు సూచించెను. వీనిలో అంతరార్థము నమస్కారమనునది ఎదుటవారిలో వశించు దేవునికి కాని ఎదుటి వారి కొరకు కాదు. దీనిని బట్టి సాక్షాత్తు ఆ ఈశ్వరుడే ప్రతి జీవిలో కొలువున్నాడనే సత్యాన్ని చెప్పినారు. ఇక ప్రతిజీవి రూపు రేఖలు, వర్ణ భేదములు శరీర వర్ణ భేదములు గొప్ప, పేద, విద్యావంతుడు, పామరుడు ... ఇలా ద్వంద్వాలను చూడటము అనవరసరము. ఇవన్నీ పై పై కప్పబడి ఉన్న తెరలాంటిదే. ఆ తెర ఎన్నో మచ్చలతో కూడుకుని ప్రతిజీవి శరీరానికి చర్మమనే పదముతో కప్పబడియున్నది. మరి అటువంటి తోలుతిత్తి శాశ్వతమా? లేదా తిత్తిలోనున్న శంకరుడు శాశ్వతమా? తోలు అశాశ్వతము. శంకరుడు శాశ్వతుడు. తిత్తిలోనున్న శంకరుని గుర్తించలేక తిక్కబట్టి తిరుగుచున్నాడు పరమాత్మ అన్వేషణకు. అశాశ్వతమైనది శరీరమని ఎరుక కలిగినప్పుడే శాశ్వతమైన శంకరుడు కన్పిస్తాడు. ఏ రోజైతే ఈ అశాశ్వతమైన శరీరము కాలి బూడిదగునో అసలు నేను అనే నిజ శంకరుడు కన్పిస్తాడు. ఆ అసలైన నేను అనే శంకరుడే భస్మముతో కప్పబడి ఉన్నాడనే సత్యము బయటపడుతుంది. కావున ప్రతిజీవి జ్ఞానికావాలి. జ్ఞానంతో చూడాలి. అలా జ్ఞాని అయినవానికి నేను అనే నకిలీ శరముతో ఉన్నను లోనున్న అసలైన నేననే శంకరుడు ఉన్నాడనే సత్యము ఎరుగుటచే అటువంటి జ్ఞాని నిరంతరము తాను కూడా భస్మోద్ధూళిత విగ్రహమే అని తలుస్తాడు.

శంకరుడు అని అనగానే రుద్రాక్షలు ధరించేవాడు అని అందిరికి తెలిసినదే. “ఓం రుద్రాయ నమః” అని పఠిస్తే చాలు రుద్రాక్షలు ధరిస్తే ఎంత మహిమ ఉండునో అంత మహిమ పఠించిన వారికి కూడా లభించును. ఇక రుద్రాక్షలు ధరించినవారిక సంగతి చెప్ప నవసరము లేదు. “శ్రీ గురుచరిత్రము” నందు 33వ అధ్యాయమున రుద్రాక్ష మహిమ తెలిపెను. అవి

(1). శ్రద్ధతో రుద్రాక్షలు ధరించువానికి ఇక పాపములు అంటవు.

(2). వెయ్యి రుద్రాక్షలను ధరించువారికి ఆ ధరించే వారి స్వరూపము రుద్రుడు. అటువంటు వారిని దేవతలే పూజిస్తారు.

(3) కంఠమున రుద్రాక్షలు ధరించినవారికి పాపములు తాకవు. పైగా వారికి రుద్రలోకము తథ్యము.

(4) రుద్రాక్షలు శిరస్సునకు కాని, చెవులకు కాని ధరించిన వారికి స్నానము చేసినచో గంగాస్నాన ఫలము కలుగును.

(5) సంసార రోగములు హరించుటకు ఏకముఖి లేదు పంచముఖి లేదా 11 ముఖములు లేదా 14 ముఖములు గల రుద్రాక్షలు ధరించవలెను.

(6) రుద్రాక్షలు ధరించువారికి చతుర్విధ పురుషార్థములు లభించును.

భద్రసేనుడు అను రాజు వాని మంత్రి సుధర్మమునికి ఇద్దరికి తారకుడు, సద్గుణుడు అనే పుత్రులు కలరు. వారిరువురు శివ భక్తులు. సర్వావయవములందు రుద్రాక్షలనే ధరించి, స్వర్ణ రత్నాభరణములను లెక్క చేసెడివారు కాదు. ఆ రాజు మరియు మంత్రి పరాశర మహర్షిని ఆ పుత్రుల ప్రవర్తనను గురించి ప్రశ్నింపగా ఈ ఇరువురు పుత్రులు గత జన్మయందు ఒక వేశ్య కడ కుక్కుటము (కోడి) మరియు మర్కటము (కోతి)గా పెరుగుచు, ఆ రెండు రుద్రాక్షభూషితులై ఉండగా ఆ వేశ్య మండపము అగ్ని ప్రమాదములో దగ్ధమైనప్పుడు కుక్కుట, మర్కటములు కూడా ఆ ప్రమాదములో దగ్ధమయ్యెను. కాని ఆ రెండు రుద్రాక్ష భూషితములై దగ్ధమయ్యెను కావున కుక్కుటము మంత్రి కుమారుడుగా, మరియు మర్కటము మహారాజు కుమారుడుగా జన్మించి రాజసుతులై జ్ఞానులై ఈశ్వర భక్తులు కాగలిగిరి. పూర్వ జన్మ సంస్కారమువలననే రుద్రాక్షలు ఈ జన్మయందు కూడా ధరించి వారి పుణ్యమునకు పరిమితి లేకుండా చేసుకొనినారు.

"ఓం నీలలోహితాయ నమః" అని శంకరుని పఠించెదరు. శంకరుడు లోకరక్షకుడు, లోక కళ్యాణమునకై శివుడు ఏ కార్యమునకైనను వెనుకాడడు. శివుడు ఎంతటి భోళాశంకరుడంటే అమృతము కోసము దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగరమును మథించినప్పుడు ముందు కాలకూట విషయము బైటపడెను. ఆ ప్రళయాగ్ని వంటి కాలకూట విషాన్ని సకల లోకములకు హాని కలుగకూడదని ఆ భోళాశంకరుడు ఆ కాలకూట విషమును మింగి, కంటకూపమున నిలిపి లోకాన్నే రక్షించినాడు. ఆ విషము కంఠమందు స్థిరముగా ఉండుటచే ఒక భూషణరూపమైన నీల రత్నమా అను సంశయము అందరికి కలిగినను "ఓం మృత్యుంజయాయ నమః" ప్రళయాగ్ని వంటి కాల కూట విషమును త్రాగి శంకరునికి మృత్యువే లేదని మృత్యుంజయుడని ఋజువయ్యెను.

"ఓం అవ్యయాయ నమః" అనే నామము శంకరునికి కలదు. వ్యయము అనగా ఖర్చు. అవ్యయము అనగా ఖర్చుకానిది. ఈశ్వరుని కరుణ నిజానికి అవ్యయము. అనగా ఎంత కరుణ కురిపించనను ఆ కరుణ తరగనిది లేదా ఖర్చుకానిది. ఒక్కసారి బ్రహ్మ మరియు విష్ణువు ఇరువురికి ఇద్దరిలో ఎవరు అధికులో అనే వివాదము జరిగెను. వారిరువురు శివుని కడకు వచ్చి విషయము తెలుపగా, అంతట ఆ పరమేశ్వరుడు "మీలో ఎవరు నా రూపము యొక్క అంతం చూడగలరో వారు అధికు"లని శివుడు తన రూపమును పెంచెను. బ్రహ్మ శివుని శిరము కనుగొనుటకు, విష్ణువు శివుని పాదములు కనుగొనుటకు తలచి బ్రహ్మ హంసరూపమున, విష్ణువు వరాహ రూపమున అన్వేషించుట ప్రారంభించెను. కాని శివునిరూపము అంతులేకుండెను. ఈ విషయములో శంకరుడు తన రూపమునకు అంతులేదని ఋజువుచేసెను. అనగా శివరూపము అవ్యక్తం అని ఋజువుచేసెను. సర్వేశ్వరుడు సర్వానికే ఈశ్వరుడు. సర్వవ్యాపి. మరియు సర్వాంతర్యామి. శివుడు భౌతికముగా తన రూపమును పెంచినను ఆది మరియు అంతము కనుగొనుటకు శక్యము కాదనే సత్యాన్ని గ్రహించినచో శివుడు తన రూపము మటుకే కాక రూపానికి అతీతముగా ఉన్నాడనే సత్యం తెలుస్తుంది. ఈశ్వరుడు తన శక్తి ఎంతమేరకు ప్రవహించినదో ఎవ్వరికీ తెలియదు. ఏకమైన పరమాత్మ అనేకముగా సర్వజీవులలో అంతర్యామిగా ఆవహించియున్నాడు. ఆ పరమాత్మని శరీరమనే పదముతో అలంకరించబడియున్నది. కాని ఆ అలంకరణ అశాశ్వతమే. లోనున్న పరమాత్మను అగ్ని దహింపజాలదు. ఆ చైతన్య ప్రకాశమును వాయువు ఆర్పివేయనూ లేదు. నీటిలో తడిపినను ఏమీ కాదు. ఆ చైతన్యమే నిశ్చలము, నిర్మలము, శాశ్వతము. శరీరమనే అలంకరణము ఏనాడైతే ఆయువు తీరి నశిస్తుందో శరీరము కాలి భస్మమగును. కాని భస్మములో

నున్న చైతన్యము మాత్రము భస్మము కాదు. ఆ చైతన్య విగ్రహమే ఆ భస్మోద్ధూళిలో ప్రజ్వరిల్లుచున్నది. ఎలా అంటే నిప్పుపై బూడిద కప్పబడియున్నట్లు ఆ చైతన్య విగ్రహమునే భస్మోద్ధూళిత విగ్రహయ అంటే ఆ పరమాత్మ అయిన ఆ శంకరుడే భస్మోద్ధూళిత విగ్రహుడు.

ప్రస్తుతయుగము కలియుగము బ్రహ్మదేవుడు కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము మరియు కలియుగము సృష్టించి వారిలో ఒక్కొక్కరికి ఒక కార్యము నప్పగించెను. ప్రస్తుత యుగము కలియుగము కనుక కలిని భూమికి చేరి ఉండమని బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించగా కలి తన స్వభావము ఎంత నీచముగా ఉండునో విశదీకరించెను. అందులో ముఖ్యమైనవి కలి ఉన్న చోట నిద్ర, కలహము, శోకము, పరద్రవ్యాపహారి, అన్య భార్యాపహారి మొదలైనవి తాండవించుట, మోసము చేయువారు కలి వారిని తన ఆత్మగా భావించుటయే కాక ఇతరులను అనగా పుణ్య కార్యములు చేయువారందరు తనకు శతృవులు. అంత ఆ బ్రహ్మ కలిపురుషునికి ఒక ఆదేశము నిచ్చెను. భక్తితో పరమేశ్వరుని భజన చేయువారు కృతార్థులు కాగలరని అట్టి పుణ్యాత్ములకు, దేవ సేవకులకు, ఎటువంటి విఘ్నములు కలిగింపక వారికి సహాయపడమని బ్రహ్మ కలిపురుషునకు ఆజ్ఞాపించెను. అలాగే అభేద బుద్ధితో శివకేశవులను భజించు వారికి, గురుసేవ చేయువారికి మరియు కాశీనివాసులకు కలిదోషముల ప్రభావము కలుగజేయజాలదు. కావున భక్తితో పరమేశ్వరుని భజించేవారిని అబేధ బుద్ధితో శివకేశవులను భజించువారిని మరియు కాశీవాసులను ఈ కృతయుగము నందు కలిపురుషుని ప్రభావము ఏ మాత్రము పీడించదనే సత్యము సాక్షాత్తు బ్రహ్మదేవుని మాట ద్వారా తెలుసుకున్నాము. శివ భక్తులకు ఇక కలిప్రభావము లేనట్లే.

త్రిమూర్త్యాత్మక రూపము అనగా బ్రహ్మ, విష్ణువు మరియు శివుడు. బ్రహ్మదేవుడు సృష్టికర్త. విష్ణువు స్థితి అధిపతి. శివుడు ప్రళయమునకధిపతి. శివుడు ప్రళయమునకు అధిపతి అని చెప్పినాము కదా! మరి శివుడు దేవుడే కదా? మరి ఆ పరమేశ్వరుడు ప్రళయము ఏల చేయవలెను అనే సందేహము అందరికి కలుగుట సహజమే. బ్రహ్మదేవుడు సృష్టించుట మాత్రమే బాధ్యతను తీసుకొనెను. మరి సృష్టి చేసిన దానిని రక్షించేవాడు ఒకరు బాధ్యత తీసుకొనవలెను కావున అట్టి ఆ సృష్టి స్థితిని రక్షించే ఆధిపత్యాన్ని మహావిష్ణువు తీసుకొనెను. సృష్టింపబడిన దానిని ఇలా రక్షిస్తూ పోతూ ఉంటే సృష్టించబడిన జీవికి ఇక అంతము ఉండదు తద్వారా అహంకారపూరితుడై తన కిక అడ్డు ఏమీ ఉండదని భావముతో ఉండెదరు. కావుననే ఆ సృష్టింపబడిన దానిని ఏదో ఒక రోజు నశింపచేయటానికి అట్టి ప్రళయమునకు ఆధిపత్యుడుగా శివుడు గైకొనెను. కావున ప్రళయము అనే మాటకు అర్థం ఒక తుఫాను వలనో, పెనుగాలుల వలనో అగ్నిజ్వాలలవలనో ఇలాంటివి కాదు. ఏదో ఒక రోజు పరమాత్మ ప్రతిజీవిపై ఆ పరమేశ్వరుడైన శివుడు ప్రళయమనే ఆటంకమును అనగా ఆ జీవి యొక్క ఆయుష్షు తీరిపోగానే ఏదో ఒక రూపేణా రోగము ద్వారానో, అకస్మాత్తుగనో భూమిపై పడ్డ జీవిని ఆ కాలభైరవుడు తిరిగి లాగేసుకుంటాడు. కావున ప్రతి జీవి కూడా మరణము అనేది ఒకటి ఉందని ఎరుక కలిగి ఉన్నారు. అదే ప్రళయాగ్ని. అయితే ఆ ఎరుకను ప్రతిరోజు ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకునే వారు బహు తక్కువమంది. కారణం జీవి ఆశావాది. తన కోరికలకు అంతు ఉండదు. ఒకటి తీరగానే మరొకటి పుడుతూనే ఉంటాయి. తన వయస్సు పెరుగుతున్నదనే సత్యాన్ని మరచి తద్వారా ఆ జీవి యొక్క ఆయువు తరుగుతున్నదనే సత్యాన్ని కూడా మరుచుచున్నాడు. తనకున్న అందమును శాశ్వతముగా భావించుచున్నాడు. ఈ రోజు ఉన్నటువంటి ఆ అంద చందములు రేపు ఉండదు. రోజు రోజుకి మార్పు రావటము, మాసములు, సంవత్సరములు... గడచిన పిదప అందవిహీనులుగా మారటం మన కళ్ళముందు ఎన్నో చూస్తూనేవున్నాము. వయస్సు పెరిగిన పిదప శరీర అందములో ఎంతో మార్పు వస్తుంది చర్మము ముడదలు పడుట, కాళ్ళుచేతులు స్వాధీనములో ఉండకపోవుట, చూపు తగ్గుట, వినికిడిలో మార్పు చివరకు తలవెంట్రుకలు కూడా ఊడి తెల్లబడుట జరుగును. ఇదంతా ప్రళయానికి కారణమే. అయినా జీవి ఇంత జరుగుతున్నను తన వయస్సును దాచుటకు ప్రయత్నిస్తూనే ఉంటాడు. కారణం అసంతృప్తి. బ్రహ్మ సృష్టించినప్పుడు ఎంతో శక్తివంతముగా అందముగా ఉన్నరోజులలో ఎన్నో ఘడియలు, సందర్భాలలో ఆ జీవి తృప్తి పొందినప్పటికి కొన్ని సందర్భాలలో దుఃఖము మరియు ఆపదలు వచ్చినప్పుడు అటువంటి స్థితిని మహావిష్ణువు ఎన్నో సందర్భాలలో రక్షించినప్పటికి

జీవుడు త్రిగుణాత్మకుడు కనుక అట్టి మాయాప్రభావముచే అన్నీ అనుభవించినప్పటికి ఇంకా అనుభవించవలెననే తపనతో పరుగెడుతూనే ఉన్నాడు. అట్టి పరుగుకి అడ్డు పడకపోతే ఆ జీవి ఇక అందదు. ఎవ్వరి మాట లేదాభయము ఉండదు. కావుననే శంకరుడు అటువంటి బాధ్యతను అనగా ఆ జీవి యొక్క ఆశకు హద్దు ఉందని చూపుటకై ఆ జీవికి ఏదో ఒక రోజున ప్రళయము కల్పించి ఆ జీవి యొక్క ప్రయాణానికి అడ్డు చూపి అంతము చేస్తాడు ఆ పరమశివుడు.

ఇది కలియుగము కనుక కలిపురుషుని ప్రభావముచే జీవికి మోహము ఏర్పడుటచే తృప్తి లేక అసంతృప్తితోనే బ్రతుకుతూ ఇంకా ఇంకా జీవించి ఉండాలనే ఆశను చంపుకోలేకపోవుచున్నాడు. దీనంతటికి అనర్థము శరీరము. నేనే శరీరమని, శరీరమే ఆత్మ అనే భ్రాంతివలన. ఇది తొలగాలంటే సాధకుడు కావాలి. సాధకుడవ్వాలంటే భక్తి కలగాలి. భక్తితో తన జీవితాన్ని ఆపేయక జ్ఞాని కావాలి. జ్ఞాని అయిన వాడికి లోనున్న ఆత్మలింగాన్ని చూడగలుగుతాడు. బ్రహ్మదేవుడు చెప్పినట్లుగా కలియుగమైనప్పటికి ఎవరైతే భక్తితో పరమేశ్వరుని భజన చేయువారు కృతార్థులగుదురని అట్టివారికి కలిపురుషుడు దగ్గరకు రాడని చెప్పిన సత్యాన్ని గుర్తు తెచ్చుకున్నవారు పైన చెప్పినట్లుగా జీవి అట్టి మోహపు మాయాజాలములో పడకుండా ఉండటానికి ఒకే ఒక మార్గము ఆ పరమేశ్వరుని భక్తితో భజించుటయే. ఏ జీవియైతే భక్తితో శివుని వశము చేసుకుంటాడో, ఆ పరమేశ్వరుడు అట్టి జీవియొక్క భక్తికి పరవశుడై పరమానందముతో చిందులు వేసేవాడే ఆ భోళాశంకరుడు. అట్టి శివ భక్తుడు తన భక్తి పరిపక్వము చెందిన పిదప జ్ఞాని ఔతాడు. ఆ జీవి తను నమ్ముకున్న శరీరము అసత్యమని, అది కేవలము భస్మధూళితో కప్పబడి ఉన్నదని లోపల అఖండమైన చైతన్యము కలదని అదే ఆ శివలింగమని సత్యాన్ని తెలుసుకుంటాడు. ఇక ఆ ఎరుక కలిగిన పిదప ఆ జీవికి తృప్తి కలిగి వాంఛలు నశించి ఏది జరిగినను నిశ్చింతగా నిర్మలముగా ఉంటాడు.

ఒకమారు ఓంకారమును ఉచ్చరించిన మాత్రముననే ఊర్ధ్వగతిని అనగా ప్రకృతికి పరమైన పరమపదమును లేదా ప్రపంచాతీతస్థితిని కలుగజేయును. ఓంకారమనగా పరబ్రహ్మము. పరమాత్మ యొక్క నామము ఓంకారము. భగవద్గీత యందు శ్రద్ధాత్రయ విభాగయోగము నందు ఓంకారము యొక్క మహిమను, ప్రాముఖ్యతను గూర్చి వివరించబడినది. ఏదైనా లోపములు, దోషములు మొదలైనవి కర్మానుష్టాన మందున్నప్పుడు, ఓంకార ఉచ్చరణచే అవి హతమై పరమ పవిత్రములగును. ఏ కార్యమైనను ప్రారంభించే ముందు ఓంకారమును నుచ్చరించెదరు. ప్రతి మంత్రమునకు ముందు కూడా 'ఓం' అని ఉచ్చరించెదరు. వేదముల యొక్క మూలము వేదసారమంతయు కూడా ఆ ఓంకారము నందే కలవు. కావున ఓంకారమంటే పరబ్రహ్మము. ఆ నామము మహాశక్తివంతమైనది. పరబ్రహ్మానికి ఓం అనే నామముతో పాటు తత్ మరియు సత్ అనే నామాలు కూడా కలవు. ఓం తత్ సత్ అనగా పరబ్రహ్మము కలదు, ఆ పరబ్రహ్మమే సద్రూపమైనదని అర్థము. యజ్ఞదాన తపః క్రియలకు మొట్టమొదట ఓంనే ఉచ్చరించెదరు. "ఓం శివాయ నమః" అనగా పరబ్రహ్మ శివ నీకు నమస్కారములని అర్థం. శంకరుడే పరబ్రహ్మమైనప్పటికి ఆ పరమేశ్వరుడు కూడా అను నిత్యం ఓంకారాన్ని జపించేవారట. ప్రతిజీవి తాను శరీరము కాదు అని శరీరములో నున్న లింగాన్ని ఆత్మ కనిపెట్టవలెనంటే ఓంకార నామ జపము ఎంతో తోడ్పడుతుంది.

పరమశివుడు ఎల్లప్పుడు ధ్యాననిమగ్నుడై ఉండెదరనేది అందరికి తెలిసిన విషయమే. కాని చాలామంది పొరబడేది శంకరుడు తన కన్నులను మూసుకుని ధ్యానము చేసెదరని. కాని పరమేశ్వరుడు తన కనురెప్పలు అటు మూసినట్లుగా ఇటు తెరిచినట్లుగా కనపడకుండా పాక్షికంగా ఉంటాయి. చూసేవారికి కనురెప్పలు మూసినట్లుగానే ఉండెడిది. శంకరుడు కనులు మూసినచో లోకములంతా అంధకారమైపోవును. దీనికి ఋజువుగా పూర్వము పార్వతీదేవి పరిహాసార్థముగా త్రినేత్రుని త్రినేత్రములను పార్వతి తన రెండు చేతులతో మూయగా లోకములకంతా అంధకారమయ్యేను. నిజానికి పార్వతి పరమేశుని నేత్రములను అర్థ నిమిషము మాత్రమే మూసెనట. కాని అది లోకములకు కోట సంవత్సరములు భయంకరముగా పరిణమించెను. ఈ సంఘటన పరిశీలించినచో ఆ పరమేశ్వరుడు తన కన్నులను ఎప్పుడు మూయరనే సత్యము ఋజువైనది. ఈశ్వరరూపుడైన సద్గురు శ్రీ సాయిబాబా వారు కూడా తన దర్బారులో చూచే జనులకు నిద్రించినట్లు కనిపించారే గాని యోగులు నిద్రించుట

జరుగదు. వారు కూడా ఈశ్వరుని లాగే కనులు మూసినట్లుగానే వారు నిద్రించునప్పుడు కనిపించేది. కాని వారు పాక్షికముగానే మూసి తెరచినట్లుగా నిదురించేవారు. కావున సాయికి, ఈశ్వరునికి భేదము లేదు. సాయి కూడా ఈశ్వరుడే కావున సాయీశ్వరుడే.

శంకరుడు గరళకంఠుడు. శంకరుని కంఠమునకు సర్పము చుట్టబడి ఉండుట తెలిసినవిషయమే. సాక్షాత్తు గరళాన్నే మింగిన శివునికి తన మెడకు చుట్టబడి యున్న విషసర్పము ఇక శివుడి ముందు ఎంత? శివుడు త్రిశూలధారి. ఢమరుకధారి. కమండలధారి. శంకరుని శిరస్సుపై చల్లదనాన్ని ప్రసరింపచేసే చంద్రుడు ఉండగా శివుని మూడు కన్నులు సూర్య, చంద్ర, అగ్ని తత్త్వముతో కూడుకుని యున్నవి. ఇంకాస్త దిగువకు వస్తే శంకరుని కంఠమునకు సర్పము, మరియు ఆ కంఠమునకు గరళము భూషణముగా యున్నవి. ఇవి కాక ఒంటి నిండా భస్మముతో పూయబడి మరియు రుద్రాక్ష మాలలతో చుట్టబడి శంకరుడు కనిపిస్తాడు. ఒకసారి శివుడు పాదముల నుండి శిరస్సు వరకు గమనించినచో ఒకటి చల్లదనాన్నిచ్చేది మరియొకటి వేడిని పుట్టిచ్చేది. ఒకటి సాధారణ భూషణము మరియొకటి విషసర్పముతో నున్న భూషణము. మరియు ప్రాణముతో కన్పించుచున్న శరీరానికి కంఠము మధ్య గరళముతో నిండియుండడము విచిత్రముగా అనిపిస్తుంది. దీనిని బట్టి శివ అవతారము అతీతమైనటువంటిది. ఊహించలేనిది. అన్నింటికి సమత్వముతో కూడిన అవతారము. శంకరుని అర్థాంగి పార్వతి దేవి. ఆ అంబ కూడా శివశక్తి స్వరూపమే. శివుడు ఒక్కడే అయినా పరాత్పరుడు మరియు అనన్యుడు. శంకరుని శక్తి అయిన మాయ ఆశ్రయించి ఏకరూపుడైన శివుడు అనేక రూపుడైనాడు. నిజానికి శివుడు అభిన్న శక్తి స్వరూపుడు. శివశక్తి స్వరూపమే అర్థాంగి అయినది. శివుడు ఎంతటి గొప్పవాడంటే సాక్షాత్తు నారాయణ రూపుడైన శ్రీరామచంద్రుడు సేతు బంధము ఆరంభించే సమయమున శ్రీరాముడు శివశంకరుడగు రామేశ్వరుని స్థాపించి, పూజించి ఇట్లనెను, “ఈ సేతు బంధమున దర్శించి రామేశ్వరమునకు నమస్కరించు మానవులకు నా అనుగ్రహమే కాకుండా బ్రహ్మహత్యాది పాపముల నుండి కూడా ముక్తుడగునని మరియు సేతు బంధమున స్నానము చేసి రామేశ్వరుని దర్శించి కాశీనుండి గంగాజలమును తెచ్చి రామేశ్వరుని అభిషేకించి అట్టి అభిషేక తీర్థ పాత్రను సముద్రమున ఒదలిన మానవునికి బ్రహ్మను పొందగల”దని కూడా శ్రీరాముడు అభయమిచ్చినాడు.

శివుడు సర్వాంతర్యామి. పంచభూతాలు కూడా ఆ శివలింగములే. నింగి ఆకాశ లింగముగా నిప్పు అగ్ని లింగముగా నీరు జల లింగముగా గాలి వాయు లింగముగా మరియు నేల పృథ్వీలింగముగా పరిగణింపబడినది. ఈ పంచభూతాలను పంచ భూతేశ్వరునిగా పరిగణింపబడినాయి. అనగా శివుడు పంచభూతములుగా జీవకోటికి సహాయపడుతున్నాడు. శివునికి కావలసినది తన భక్తుని యొక్క స్వచ్ఛమైన మనస్సే. ఆ మనస్సే ఆ పరమేశ్వరునికి పుష్పము. కావున శివుని కొరకు ప్రయాస పడుతూ కొండకోనలలో, లోతైన చెరువులలో లేదా అరణ్యములలో తిరిగి శివుని కొరకు పూలు తేనవసరము లేదు. స్వచ్ఛమైన మనస్సనే పుష్పాన్ని శివపాదములపై సమర్పించినవానికి శివానుగ్రహము తథ్యము. ఇక ఆ భక్తుడు కైలాసములో ఉన్నట్టే. ఆ కైలాసనాథుడు అటువంటి భక్తుని అనునిత్యము కంటికి రెప్పవలె కాపాడుతుంటాడు. పైన చెప్పబడినట్లుగా ఏ జీవి అయితే శ్రద్ధా భక్తితో కాసిని నీళ్ళను చేతిలో ఉంచుకుని జీవి తన శిరస్సుపై చల్లుకొనిన యెడల సాక్షాత్తు శివలింగానికి అభిషేకము చేసినట్లే కారణం ప్రతి జీవిలోపల ఆత్మ అనేది ఉండుననీ అందరికీ తెలిసినదే. అదే ఆత్మలింగము. ఆ ఆత్మ లింగము భగవాన్ రమణ మహర్షి చెప్పినట్లుగా ప్రతిజీవి యొక్క రొమ్ముకు కుడి ప్రక్కన ఉండును. కావుననే నేను అని ఎవరైనా సంబోధించినప్పుడు ఆ సంభోదించిన వ్యక్తి తనకు తెలియకుండానే తన చేయి తన రొమ్ముకు కుడిప్రక్క చూపుతూ “నేను” అని పలికెదరు. మరి అట్టి ఆత్మలింగము ప్రతి జీవి అంతరంగములో ఉండుట కారణముగా అట్టి ఆత్మలింగానికి జలముతో అభిషేకించవలెనన్న జీవి తన శిరస్సుపై నీళ్ళు చల్లుకొనిన యెడల లోనున్న ఆత్మలింగానికి అభిషేకించినట్లే అగును. కొన్ని కొన్ని సందర్భాలలో మనము గమనిస్తూనే ఉంటాము. కొన్ని పుణ్యకార్యములకు వెళుతున్నప్పుడు పవిత్ర స్థలములను దర్శించినప్పుడు లేదా పుణ్యనదుల వద్ద ఉన్న భక్తులు వారి వారి శిరస్సులపై నీళ్ళను చల్లుకుని కార్యములు చేస్తూ ఉంటారు. ఇది ఆత్మ లింగ అభిషేకమే. ఆత్మ ఎప్పుడు శుద్ధితోనే ఉంటుంది. అట్టి ఆత్మలింగానికి ప్రత్యేకించి శుద్ధి చేయ నవసరము లేదు.

కాని శుద్ధి చేయవలసినది మనస్సును. మనస్సు ఎటువంటి ఆలోచనలు లేనప్పుడు అది ఆత్మే. మనస్సు చలించినప్పుడు శరీరధ్యాస మరియు నకిలీ నేను ప్రభావితం జరుగుతుంది. కావుననే ప్రతిజీవి స్వచ్ఛమైన మనస్సుతో కాసిని నీళ్ళను శిరస్సుపై చల్లుకుని తన మనస్సును ప్రక్షాళన చేసుకున్నచో ఆ చల్లిన జలము ఆత్మలింగముపై పడును. అట్టి స్వచ్ఛమైన మనస్సే శివునికి సమర్పించవలసిన పుష్పము.మరే పుష్పాలు శివునికి అవసరం లేదు.అటువంటి జీవికి తాను చేయు కార్యములకు మరియు ఆ కార్యవిజయమునకు కారకులు లోనున్న ఆత్మలింగమేనని గ్రహించి ఆ దివ్య తేజముతో వెలుగుచున్న తన ఆత్మలింగానికి శరీరమనే చర్మముతో కప్పబడియున్నదని అట్టి తాను ఒక తోలు బొమ్మ అని లోనున్నది బొమ్మకాదని చైతన్యమని ఏనాడైతే ఆ తోలు కాలి బూడిదగునో తేజోవంతమైన చైతన్యమే తన నిజస్వరూపమని గ్రహిస్తాడు. దీనిని బట్టి ప్రతి జీవి కూడా భస్మోద్ధూళిత విగ్రహుడు అనగా ప్రతిజీవి కూడా శంకరుడే.

శివుడు అనగానే వైరాగ్యము గుర్తుకు వస్తుంది. నిజానికి శివుడు వుండేది కైలాసము. కాని శివుడు లయకారకుడు. కావున శ్మశానములో ఉండెదరని అంటారు. అందుకే శివాష్టకము నందు “శ్మశానే వసంతం” అని సూచింపబడినది. శివునికి సువర్ణాభరణాలు తన ఒంటిపై ఎక్కడా కన్పించవు. పైగా వైరాగ్యము చూపే ఆభరణములు తన ఒంటిపై కన్పిస్తాయి. తన ఒంటి నిండా భస్మము రాసుకుని కైలాసమును వీడి తన ధర్మము ఈ లోకములో జీవులను లయము చేయవలెను. కావున శ్మశానములో ధ్యాననిమగ్నుడై ఆయువు తీరిన జీవులను తనలో లయము చేసుకొనుటకే పద్మాసనములో ఆ శ్మశానము నందు ఆశీనుడై ఉంటాడు. ఇందులో అంతరార్థము పరమేశ్వరుడంటేనే ఒక అనంతమైన అఖండమైన శక్తి. ఆ శక్తి అనిర్వచనీయమైనది. దేదీప్యమానముగా వెలుగునది. అట్టి ఆ అనంత వెలుగు కిరణాలనుండి ఎన్నో వెలుగుకాంతులు ప్రతి జీవి అంతరంగములో చైతన్యరూపములుగా చోటు చేసుకున్నాయి. అట్టి ఆ చైతన్యములను శరీరముతో కప్పబడి ఉండుట చేత అట్టి దేహము ధరించుట చేత ఎన్నో వ్యాధులు మరియు ముసలితనము చివరకు మృత్యువు కూడా కలుగును. ఇది ప్రతిజీవికి తప్పదు. అట్టి సహజమైన వ్యాధులను లేదా వృద్ధాప్యమును లేదా మృత్యువును తప్పించుట అసంభవము. ఎన్ని మంత్రతంత్రములు చేసినా హఠయోగాదులు చేసినా జీవి వయస్సును దాచి పైపై రంగులు పూసినా ప్రయోజనము లేదు. దేహము ధరించినందువలన అట్టి దేహముపై మోహము కలుగుట సహజము. అట్టి వ్యామోహము తొలగవలెనన్న అన్నిటియందు దైవమును చూడవలెను. అప్పుడు వ్యాధిగ్రస్తుడైనను వృద్ధాప్యము వచ్చినను చివరకు మృత్యువు ఆవరించిననూ వాటి నన్నింటిని దైవలీలగా భావిస్తాడు జ్ఞానియైన జీవి. తాను దేహము కాదు కనుక వ్యామోహము ఉండదు. తన సుఖదుఃఖములకు కారణము తన పూర్వజన్మల కర్మఫలమని తెలుసుకుని అట్టి ప్రారబ్ధకర్మల ననుభవిస్తూనే తనలో మూలమైన ఆ అఖండ పరంజ్యోతి పరమాత్మనుండి తాను కూడా (జ్ఞాని) ఆ వెలుగు భాగమేనని గ్రహించి అట్టి చైతన్యమును దేహము కప్పబడి యున్నదని తాను మరణించినను కనిపించే దేహము మటుకే పోవునని ఆ దేహము కాలిన పిదప భస్మోద్ధూళిత విగ్రహములో నున్న ఆ మూల అఖండ పరంజ్యోతి పరమాత్మ వెలుగు భాగము తిరిగి ఆ అఖండ పరంజ్యోతిలోనే లయమవుతుందని తెలుసుకొనుటవలన అట్టి జ్ఞాని మృత్యువునకు భయపడడు. తన సర్వ కర్మలను శివోహం అని ఆ శివునికి సమర్పించుకుంటాడు. సర్వం ఈశ్వరార్పణమస్తు అని అనుకున్నప్పుడు తన మృత్యువు వేరుగా ఎలా అవుతుంది? అది కూడా ఆ ఈశ్వరుడికి అర్పించుటయే. ధర్మము. కావున శివుడు అని అనగానే వైరాగ్యము గుర్తుకు వచ్చే మాట నిజమే కాని అట్టి వైరాగ్యమును అర్థం చేసుకున్నచో జీవాత్మ, పరమాత్మ వేరు వేరు కాదని ఆ జీవాత్మే చైతన్య వెలుగు మూల విరాట్ అయిన అఖండ పరంజ్యోతి పరమాత్మ చైతన్యములో భాగమేనని యావత్ ప్రపంచమంతా ఆ అఖండ పరంజ్యోతి పరమాత్మ వెలుగుతో నిండి ఉండెననే సత్యం తెలుస్తుంది. దేహము ఆ చైతన్యమును కప్పబడి ఉండుటచే మూల విరాట్ చైతన్య వెలుగు భాగము బైటకు కన్పించుట లేదు. శరీరము పతనమై కాలి బూడిదైనను పిదప ఆ మూల విరాట్ చైతన్య భాగము కన్పించి మూల విరాట్‌లో లయమవుతున్నది. అంటే అంతా ఆ మూల విరాట్ చైతన్య వెలుగే. ఉన్నది ఆ ఒక్క వెలుగే. అనేక వెలుగు భాగములై జీవకోటిలో చోటు చేసుకున్నాయనే సత్యం ఋజువైనది. కావున శంకరుడు లయకారుడనగా లయమంటే నాశము చేసేవాడని అనుకొనక అంటే నశింపచేసేవాడు అని అర్థం తీసుకొన ఆ సర్వేశ్వరుడైన పరమేశ్వరుడు అఖండ పరంజ్యోతి

పరమాత్మ నుండి వెలువడిన కాంతి విభాగాలను వివిధ జీవులలో ప్రసరింపజేసిన శంకరుడు తిరిగి తన అఖండజ్యోతిలో లయం చేసుకుంటున్నాడని అర్థం. అనగా జీవరాసులు మరణించిన పిదప, వాటి దేహము కాలిన పిదప, లోనున్న కాంతి మూలవిరాటైన ఆ అఖండ పరంజ్యోతి నందు జీవరాశి కాంతి కలిపోతుందన్న మాట. ఎలాగైతే సూర్యకాంతి ముందు దీపము వెలిగిస్తే ఆ దీపకాంతిని సూర్యకాంతితో కలిసిపోయినట్లుగా.

శివుడు అనగా అఖండ పరంజ్యోతి పరమాత్మయే అని తెలిసింది. మూలవిరాట్టు అగు ఆ అఖండ పరంజ్యోతి అనేక కాంతులు ప్రసరించి ప్రతిజీవిలో ఆత్మ అనే జ్యోతిర్లింగముగా వెలుగుచున్నది. ఆ పరమేశ్వరుడు సర్వాంతర్యామి కావున ఆ జ్యోతిర్లింగాలు అంతరములోనే కాకుండా బాహ్యముగా ద్వాదశ జ్యోతిర్లింగాలుగా అవతరించినాయి. అవి

1. సౌరాష్ట్రమున సోమనాథుడుగా
2. శ్రీశైలమున మల్లికార్జునుడుగా
3. ఉజ్జయిని మహాకాలుడుగా
4. ఓంకారమున పరమేశ్వరుడుగా
5. హిమవంతమున కేదారేశ్వరుడుగా
6. ఢాకినిన భీమశంకరుడుగా
7. వారణాసిన విశ్వనాథుడుగా
8. గోదావరీ తీరమున త్రయంబకేశ్వరుడుగా
9. చితాభూమిన వైద్యనాథుడుగా
10. దారుకావనమున నాగనాథుడుగా
11. సేతుబంధమున రామేశ్వరునిగా
12. శివాలయమున గృణేశ్వరుడుగా.

ఇందు ప్రతి జ్యోతిర్లింగానికి ఒక్కో ప్రత్యేకత కలదు. అందులో ముఖ్యమైనది 'వారణాశి'. వారణాశికి 'కాశీ' అనే పేరు కూడా కలదు. వారణాశిలో గంగానదీ తీరములోఎన్నో ఘట్టాలు కలవు. అందు ప్రప్రథమమైన 'వర్ణ' అనే ఘట్టం ఉత్తరాన మరియు చిట్టచివర ఘట్టం 'అసి' దక్షిణాన ఉండుటచే 'వారణాశి' అనే పేరు వచ్చినది. మరియు కాశీ అంటే ప్రకాశించేదని కూడా అర్థం. అట్టి మహాక్షేత్రమున పరబ్రహ్మము తన నుండి ఒక శక్తిని ప్రసరింపచేసి ఆ శక్తియే స్త్రీరూపమైన పార్వతిగా మరియు ఆ పరబ్రహ్మానికి పురుషరూపము పరమేశ్వరుడుగా అవతరించి ఆ అవతరించిన లోకం భూలోకముగా అట్టి భూలోకములో పరమపవిత్రమైన కాశీక్షేత్రాన్ని ఎంచుకున్నారు ఆ పార్వతీ పరమేశ్వరులు. ఆ పరబ్రహ్మ పరంజ్యోతి పరమాత్మ నివశించే ఆ కాశీక్షేత్రము సంపూర్ణముగా ప్రకాశించుటచే ఆ కాశీక్షేత్రం ప్రకాశించేది కావున కాశీ అంటే ప్రకాశించేదని అర్థం ఋజువైనది. శివుడు అనగానే వైరాగ్యము గుర్తుకు వస్తుందని ఆ శంకరుడు 'స్మశానవాసి' అని కూడా అంటారు. అట్టి శివుడు కాశీక్షేత్రమున నివశిస్తున్నాడు. కావుననే బిల్వాష్టకమున "కాశీక్షేత్ర నివాసంచ కాలభైరవ దర్శనమ్" అని సంభోదించబడినది. అట్టి శ్మశానవాసి అయిన శివుడు వారణాశిలో ఉండుటచే కాశీకి మహాశ్మశానమని వ్యవహరింపబడినది. గంగానదీ తీరం ఒడ్డున కాశీక్షేత్రం కలదు. అట్టి తీరమున ఎన్నో ఘట్టాలు కలవు. అందులో ముఖ్యమైనది మణికర్ణికా మరియు హరిశ్చంద్ర ఘట్టాలు. ఇక్కడ అనేక మృతదేహాలకు అగ్ని సంస్కారాలు జరుగుతాయి. సాక్షాత్తు శివుడు నారాయణునితో

"ఏ జీవి కాశీనందు కాలుమోపునో ఆ జీవి పాపాలు ఆ జీవితో పాటు కాశీలోనికి రావు" అని చెప్పినారు. సాక్షాత్తు శంకరుడు ఏమి చెప్పారంటే "కాశీలో ముక్తి మండపంపై కూర్చుని ఉండి కాశీలో ప్రాణాలు వదిలిన వారి ప్రాణాలను నా ఒడిలో లాక్కుంటాను." మూలవిరాట్టగు ఆ అఖండ పరంజ్యోతి పరమేశ్వరుడైన శివుడు తన అఖండ జ్యోతి నుండి ఎన్నో కాంతి కిరణాలను ప్రసరింపజేసి అనేక జీవులలో ఆత్మ అనే లింగముగా ఉద్భవించి ఆ శివుడు లయకారుడు కావున తన ధర్మమును పాటించుటకై కాలం తీరిన జీవిని తాను ప్రసరింపచేసిన కాంతి కిరణ జ్యోతిర్లింగాన్ని తిరిగి తన కాంతిలోకి లయం చేసుకునేందుకే శంకరుడు కాశీక్షేత్రమున ధ్యానమగ్నుడై కూర్చుని ఉన్నాడు. ఆ పరమేశ్వరుడు సృష్టికర్త ఒక్క కాశీక్షేత్రమున మాత్రమే ఉన్నాడని అనుకోవద్దు. యావత్ ప్రపంచమున పరమేశ్వరుడు లేని చోటు లేదు. ఆ పరమేశ్వరుడి నుండి ఉద్భవించిన శక్తి యొక్క అఖండ పరంజ్యోతి యావత్ ప్రపంచమంతా వ్యాపించి ఉన్నది. ప్రపంచమంతా కాంతిమయమే. అటువంటి కాంతిమయంలో ఒక భాగము కాశీక్షేత్రం. జీవులు శరీరధారులు కావున అంతటా పరమాత్ముడున్నాడు అంటే నమ్మరు. కావుననే శరీరధారులైన మనలాంటి జీవుల కోసం కొన్ని కొన్ని ప్రత్యేకస్థలాలు, నదులు కలవు. అట్టి స్థలాలలో అడుగిడిన పుణ్యం లభించునని చెప్పబడినది. కావుననే జీవుడు అట్టి పుణ్యక్షేత్రాల గురించి చెప్పినది వినుటచే నమ్మకము కలిగి అటువంటి క్షేత్రాలకేగుతారు. నిజానికి ఆ అఖండ పరంజ్యోతి పరమాత్ముడైన ఆ పరమేశ్వరుని కాంతి ప్రకాశానికి హద్దులేవి? అవి పరిమితము కాదు. సర్వము వ్యాపించి ఉన్నది. అయితే కాశీక్షేత్రము కైవల్య జన్మనిలయమే. కాశీలో మరణించిన వ్యక్తికి ముక్తి కలగటం తథ్యం.

"ఓం త్ర్యయంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్

ఉర్వారుక మివ బంధనా మృత్యోర్ముక్షీయ మామృతాత్"

ఇది మృత్యుంజయ మహామంత్రము. ఈ మంత్రం జపించినచో మృత్యువును కూడా జయింపవచ్చును. అయితే ఇది కలియుగము కావున కలిపురుషుని ప్రభావముచే పాపపుణ్యములలో పాపం చేయు జనుల శాతము ఎక్కువ ఉన్నది. పైగా ప్రారబ్ధ కర్మము ప్రతి జీవి తనతో పాటు ప్రతి జన్మయందు తెచ్చుకోవడం జరుగుతుంది. శరీరధారియైన జీవి జన్మించుట ఎంత సత్యమో మరణించుట కూడా అంతే సత్యము. జీవి తాను భూమిపై పడినప్పుడు ఒంటరిగనే వచ్చి తన ఆయువు తీరిన పిదప ఒంటరిగనే తిరిగి వెళ్ళిపోవుట జరుగును. మరి పుట్టుక మరియు మృత్యువునకు నడుమ జరుగనున్న నాటకము కూడా ఒక్క తనను సృష్టించిన పరమేశ్వరుడు తప్ప మరెవ్వరూ తోడు ఉండరనే సత్యాని తెలుసుకొనినచో ఆ జీవికి ఇక భయమన్నది ఉండదు. చాలామందికి మృత్యువంటే భయపడుట జరుగును. ఆ భయం తీరవలెనన్న పైన చెప్పబడిన మృత్యుంజయ మహామంత్రమే ఉపాయము. అనగా ఆ మహామంత్రాన్ని జపించినవారికి మృత్యువంటే భయము తొలగును. కాని ఇక మృత్యువు రాదు అని అనుకోవద్దు. ఎప్పుడైతే ఈశ్వరుడు మృత్యుంజయమహామంత్రము జపించగా, అసలు మృత్యువనేది ప్రతిజీవి యొక్క జీవితములో అది ఒక భాగమేనని తెలిసికొని మృత్యువంటే భయం లేకుండా ఉంటాడు. కావున మృత్యుంజయ మహామంత్రము ప్రతిజీవికి ఎంతో ధైర్యాన్ని నొసగుతుంది.

జీవికి ఎప్పుడైతే దేహముపై వ్యామోహము పోతుందో అనగా తాను శరీరము కాదని తన శరీరము భస్మోద్ధూళి అని అసలు తానంటే ఆ భస్మద్ధూళిలో దాగియున్న ఆ చైతన్యమని తెలుసుకున్నప్పుడు తాను కర్మ చేయునప్పుడు కూడా జ్ఞానముతో అనగా ఈశ్వరార్పణతో చేయువానికి సుఖదుఃఖములు, పాపపుణ్యములు అలాగే జననమరణాలు అనే ద్వంద్వాలు లేదా ద్వైతము ఉండదు కనుక అటువంటి జీవికి మరణం అంటే భయము ఉండదు. ఇలాంటి జ్ఞానము సంపాదించాలంటే ప్రతిజీవికి సాధన అవసరము. అన్నింటిలో దైవాన్ని చూడగలగాలి. మృత్యుంజయ మహామంత్రాన్ని కూడా జపిస్తూపోవాలి. అప్పుడే జ్ఞాని కాగలడు. నిజానికి ప్రతిజీవి కూడా జ్ఞానియే. ఎప్పటివరకంటే తన మనస్సు చంచలము లేదా చలనము కానంతవరకు, మనస్సు చలించనచో వ్యామోహము కలుగును. తద్వారా తన కామము నెరవేరకపోవుటచే క్రోధము కలుగును. కామ,క్రోధముల వలన లేదా ఈ రాగ ద్వేషముల వలన బుద్ధి నశించును. తన అశాశ్వతమైన శరీరము శాశ్వతమని తానే

ఒక శరీరమని లోనున్న చైతన్యాన్ని మరచి తన శరీరమునకై ప్రాకులాడును. తన ఆయువు తీరిపోవునని తెలిసినప్పటికి మృత్యువునాపుటకు విశ్వప్రయత్నము చేయుచున్నాడు. తన కోరికకు అనుగుణంగా నెరవేరకపోవుటచే దైవాన్ని నిందించుచున్నాడు. ప్రతిజీవి నుదుటిరాతను రాసిన ఆ పరమాత్మ జీవి ఆయుష్షు కూడా నిర్ధారించబడియేయుండును. ఆ సర్వేశ్వరుడు రాసినట్లుగా జరిగేది జరగకమానదు. అలా జరగకుండా ఉండటానికి మానవుడు ఎంత ప్రయత్నించిన అది జరిగే తీరును, కాని ఆగదు. కావున ప్రతిజీవి ఈ సత్యాన్ని గ్రహిస్తే వ్యామోహం తగ్గుతుంది. అంటే వ్యామోహము తగ్గటానికి ఏ పనిచేయవద్దని కాదిక్కడ. కర్మానుగుణముగా ఏ పని చేసినా దానిపై బంధం పెట్టుకోకుండా ఉండాలి. బంధాన్ని తెంచేవాడు పైన ఒక్కడు ఉన్నాడనే సత్యాన్ని మరచిపోరాదు.

మనకు అన్యముగా ఒక శక్తి ఉన్నదని గ్రహించవలెను. ఆ శక్తియే ఆ పరమేశ్వరుడు. యావత్ ప్రపంచాన్ని ఒక ఆట ఆడించేవాడు. తన చేతిలో ఉన్న ఢమరుకమును మ్రోగించగా, ఆ ధ్వని కనుగుణంగా ఈ జగత్తు ఆడుచుండును. అతడే సూత్రధారి. యావత్ ప్రపంచాన్ని నడిపించేవాడు. అట్టి ఈశ్వరుడు తాండవము చేసినప్పుడల్లా తాను తలచివేసిన అడుగు ప్రకారమే జగత్తులో జరుగుచుండును. అనగా ఈశ్వరుని ఆజ్ఞ ప్రకారమే సర్వం జరుగునని గమనించవలెను. ఆ సర్వేశ్వరుని ఆజ్ఞలేని ఎడల ఒక చీమైనా కుట్టదు. ఆ సాంబశివుడే అఖండ పరంజ్యోతి పరమేశ్వరుడు. తన నుండి ప్రసరింపజేసినా ఆ జ్యోతి కిరణాలను తిరిగి తనలోకి లయము చేసికొనుటకు ఆ శంకరునికి మాత్రమే అధికారము కలదు. అట్టి అధికారాన్ని ధిక్కరించుటకు గాని లేదా ప్రశ్నించుటకు గాని సామాన్య జీవులైన మనకి అట్టి అధికారమే లేదు. అటువంటప్పుడు జన్మనిచ్చిన ఆ సర్వేశ్వరుడు కాలభైరవుడై కాలము తీరిన జీవిపై త్రాడువేసి ప్రాణాన్ని లాక్కొనిన ఆ శివుని ఆపుటకు చేసే ప్రయత్నం వ్యర్థమే. శంకరుడు కైలాసివాసి అయినను తాను ఏ సుఖసంతోషాలకు నోచుకొనుటకు యత్నము చేయక తన ధర్మాన్ని నెరవేర్చుటకు స్మశానవాసిగా భువిపై తిరుగుచున్నాడు. కారణం బ్రహ్మ సృష్టికర్త అయితే మహావిష్ణువు స్థితి కర్త మరియు శంకరుడు లయకారి. శివుడు ఎంత నిరాడంబరుడో కాశీక్షేత్రమును చూసిన తెలుస్తుంది. కాశీ పట్టణము ఎన్నో సందులతో కూడియున్నది. ఎక్కడ చూచినను అంగళ్ళు, ఇరుకు సందులు, వరుస ఇళ్ళు ఇలా ఒక పథకము ప్రకారము ఉండక చాలా చిత్రముగా కనబడుతుంది వారణాసి. అలా సందులలో పోగాపోగా ఒక్కసారిగా ఆ విశ్వేశ్వరుడి ఆలయం ఎటువంటి ఆడంబరములతో నిండి ఉండక సరళముగా కనిపిస్తుంది ఆ విశ్వేశ్వరుని ఆలయం. దీనిని బట్టి శంకరునికి ఆడంబరములతో పనిలేదు. ఆయన నిరాడంబరుడు. కైలాసాన్ని వదిలి కటికనేలపై కోరి దిగివచ్చిన ఆ పరమాత్మయే భోళాశంకరుడు. ఆ కాశీపట్టణములోని సందులు ఆ ఇరుకుతనము చూచినచో మనము నేర్చుకోవలసినదేమనగా మానవుని జీవితమెల్లప్పుడు విశాలముగా ఉండదని ఒడుదుడుకులతో కష్టాలు అంతు తెలియకుండా వస్తూనేవుంటాయి. అటువంటి ఒడిదుడుగులే ఆ ఇరుకుసందులని గమనించవలెను. అయితే కాశీ నందు గంగ ప్రవహించునని అందరికి తెలిసిన విషయమే. మృతి చెందిన వారి అస్థి సంచయనము అక్కడ చేస్తూ ఉంటారు. ఎవరి అస్థులు గంగా జలములో విడువబడతాయో అవి గంగలో ఎంత కాలముంటాయో అన్ని వేల సంవత్సరాలు అతడు స్వర్గంలో సుఖిస్తాడు. గంగా తరంగాల మీద నుంచి వీచిన గాలి మృతదేహముపై వీచినచో అతని పాపాలన్ని తొలగిపోతాయి. జీవికి సద్గతి కలగాలంటే అట్టి జీవి భస్మాన్ని గంగలో కలిపిన చాలు. అట్టి పరమపవిత్ర పుణ్యక్షేత్రమున శంకరుడు ఈనాటికి కూడా తిరుగుచున్నారు. తన మూల విరాట్ నుండి ప్రసరింపజేసిన ఎన్నో లెక్కలేనన్ని కాంతి కిరణాలను యావత్ ప్రపంచములో అన్ని జీవులలో చైతన్య రూపముగా ఉన్నాడు. ఏ జీవికి ఆయువు తీరిపోవునో అట్టి జీవినుండి శంకరుడు ప్రసరింపజేసిన ఆ కాంతి కిరణాల వెలుగును తిరిగి తన మూల విరాట్ వెలుగులోనికి లయం చేసుకుంటున్నాడు. కావున ఈ ప్రపంచమంతా వెలుగే. కనిపించే జగత్తు, వస్తువులు, జీవులు అన్నీ కూడా ఆ వెలుగులోని భాగాలే. జగత్తులోని వస్తువులు మరియు జీవులు ఆ మూలవిరాట్ వెలుగులోని భాగాలు. భాగాలే అనగా అట్టి వెలుగును వస్తువు మరియు జీవుల రూపం ఆ వెలుగును చుట్టియున్నది. అట్టి వస్తువులు జీవులు రూపం తొలగిపోయిన యెడల ఆ మూలవిరాట్ వెలుగు యథాతథంగా ఉండును. ఏమి లేకపోయినా కూడా వెలుగు మాత్రము ఎప్పటికి ఉండేదే. దృష్టిని జగత్తుపై, వస్తువులపై, జీవులపై ఉంచుటచే అవి కనబడుతున్నాయి. కాని అవి కేవలం రూపాలని తెలుసుకుంటే అవి

కూడా వెలుగులో ఆ రూపాలు లయమై పోయి కేవలము వెలుగు గానే ఉంటాయి. ఇక అలాంటప్పుడు శరీరధారియైన జీవి మరణము గురించి భయపడనవసరము లేదు. కనిపించే శరీరము లేదా రూపము ఆ మూలవిరాట్ వెలుగులో ఒక భాగమని గ్రహించి దృష్టిని లోపల ఉంచిన యెడల ఆ మూలవిరాట్ పరంజ్యోతి పరమాత్మ అయిన ఆ పరమేశ్వరుడు ప్రసరించిన ఆ కాంతి కిరణం కనబడుతుంది. అనగా సర్వం వెలుగుతో నిండియున్న దానిలో మన శరీరము అడ్డుగా ఉండుటచే లోనున్న కాంతి భాగం కనబడుటలేదు. ఏనాడైతే ఈ శరీరం పతనమై కాలి బూడిదగునో ఆ భస్మద్ధూళిలో ఆ అఖండ పరంజ్యోతి పరమాత్మ వెలుగులోని భాగం కనిపించి, ఆ వెలుగు మూలవిరాట్ వెలుగులో కలసిపోతుంది. మృత్యువంటే ఇదే తప్ప మరేదీ కాదు. కావున మృత్యువంటే భయపడ నవసరము లేదు. చివరకు శోకించనూకూడదు. యావత్ ప్రపంచము పరమేశ్వరుని వెలుగుతోనే నిండి యున్నది. కావున చీకటికి చోటు లేదు. అటువంటప్పుడు మృత్యువంటే చీకటిని అనుకోవటం పొరబాటే. శరీరానికే మృత్యువు కాని లోనున్న చైతన్యానికి కాదు. కావున మనందరికి మృత్యువనేది లేదు. అందరము అమరులమే. ఆ పరమేశ్వరుని వెలుగులోని భాగములే. భస్మోద్ధూళితమైన ఈ విగ్రహములో దేదీప్యమైన ఆ పరమేశ్వరుని కాంతి ఉన్నది. మన నిజమైన రూపం భస్మోద్ధూళిత విగ్రహము మాత్రమే బయటకు లోనున్నది శాశ్వతమైన, సత్యమైన ఆ పరమేశ్వరుని శక్తి కాంతిలో భాగమైన వెలుగే మన నిజ స్వరూపం.

పరమేశ్వరార్పణమస్తు

**– కోటంరాజు శ్రీనివాసరావు**
**ఇంటి నెం. 17-17/1**
**"ద్వారకామాయి"**
**లేక్-వ్యూ- కాలనీ, పీర్జాదిగూడ**
**హైద్రాబాద్ - 98**
**సెల్ : 9346823570 // 8978307143**

